సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



బంగారు లలిత

జిల్లా వెయిట్‌లిఫ్టర్ లలిత నేషనల్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించింది. ఆమెపై అభినందనల వాన కురుస్తోంది. - 8లో



ఉద్దానంలో పెద్దపులి భయం

పెద్దపులి ఉద్దానంలోకి ప్రవేశించింది. పాదముద్రలు గుర్తించి నిర్ధారించారు. - 8లో

ఆర్డీఓగా రంగయ్య బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారిగా సీహెచ్ రంగయ్య శనివారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఆర్డీఓగా బి.శాంతి విధులు నిర్వహించారు. ఈమె విజయనగరం జిల్లా చీపురుపల్లి ఆర్డీగా బదిలీ అయ్యారు. రంగన్న ఇప్పటి వరకు విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ ఎస్‌డీసీగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

న్యూస్‌రీల్

ఆదిత్యుని సన్నిధిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్



ఆదిత్యుని జ్ఞాపికను జెడ్పీ చైర్‌పర్సన్ విజయకు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి తదితరులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణలతో ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేయించి వేదాశీర్వచనాన్ని ఆమెకు అందజేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ పుష్కరిణి చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపడతామని ప్రకటించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల రక్తదానం



జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని, మీరు చేసే రక్తదానం వల్ల అనేకమంది పేద ప్రజలు ప్రాణాల కాపాడవచ్చని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్) ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ పీఎస్‌లకు చెందిన పలువురు ఎస్‌ఐలు రక్తదానం చేశారు. వీరికి రిమ్స్ వారు అందించిన ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలను ఎస్పీ రాధిక అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న జి.జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికారులు, ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శాశ్వత లోక్ అదాలత్ (ప్రజా ప్రయోజన సేవలు) చైర్మన్ జి.జ్ఞాన శ్రీ సువర్ణరాజు అన్నారు. శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హై లెవెల్ కమిటీ సమావేశం శనివారం న్యాయ సేవా సదన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవలకు భంగం వాటిల్లితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో కేసులు చేయడానికి ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని చెప్పారు. ఎలాంటి కేసులనైనా కేవలం రెండు నెలల్లో పరిష్కరిస్తారని వివరించారు. ఇలాంటి వ్యవస్థపై అధికారులు మరింత శ్రద్ధ వహించి, ఆయా శాఖాధికారుల నుంచి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శాశ్వత లోక్ అదాలత్ సేవల వివరాలు ప్రతి కార్యాలయంలో నోటీస్ బోర్డులో అందరికీ కనబడేలా ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఉప వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ బి.అనురాధ, ఉప విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, తపాల శాఖ కేసీ పాత్రో, విద్యుత్ శాఖ ప్రతినిధి ఎల్.సి.హెచ్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

రేటు.. సిండికేటు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్కిన్‌లెస్ చికెన్

- జిల్లాలో అమాంతంగా చికెన్ ధరల పెంపు
- విజయనగరం, విశాఖ జిల్లాల్లో కిలో రూ.220
- శ్రీకాకుళం జిల్లాలో కిలో రూ.275
- కోవిడ్ నుంచి ఇదే పరిస్థితి
- కృత్రిమ కొరత సృష్టించి అమ్ముతున్నారంటూ ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

విశాఖలో కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.220, విజయనగరం జిల్లాలో కిలో రూ.220.. కానీ మన జిల్లాలో మాత్రం కిలో రూ.275కు విక్రయిస్తున్నారు. పక్కపక్క జిల్లాల్లో ఇంత వ్యత్యాసం చూసి కొనుగోలుదారులు కూడా ఆశ్చర్యపోతున్నారు. కోవిడ్ కాలం నుంచి దాదాపు ఇదే పరిస్థితి. పత్రికల్లో రేట్లు ప్రచురితమవుతున్నా.. బహిరంగంగానే ఈ మోసం జరుగుతోంది. జిల్లాలో సిండికేట్ దందా నడుస్తుందేమోనన్న అనుమానాలు కూడా జనాల్లో కలుగుతున్నాయి. జిల్లాలో మాంసం ప్రియులు ఎక్కువగానే ఉన్నారు. కోవిడ్ వచ్చినప్పటి నుంచి గుడ్లు, పాలు, మాంసం తినడం ఎక్కువైంది. దీనికి తోడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటల్ భోజనాలు విపరీతంగా పెరిగాయి. వీటిని అదనుగా తీసుకుని సంబంధిత వ్యాపారులు సిండికేటై ధరలు పెంచుకుంటూ పోతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రమంతా ధరలు ఏ రోజుకారోజు మారుతున్నా శ్రీకాకుళం జిల్లాలో మాత్రం ధరలు తగ్గించే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి కారణం శ్రీకాకుళం బాయిలర్ అసోసియేషన్ ఏ ధర నిర్ణయిస్తే ఆ ధరకే రిటైల్ వ్యాపారులు అమ్మకాలు చేయడమే.



పర్యవేక్షణ లేకపోవడం వల్లేనా..

చికెన్, గుడ్లు ధరలు నియంత్రించే అధికారం మార్కెటింగ్ శాఖ అధికారులకు లేకపోవడంతో పరిస్థితి హద్దు మీరుతోంది. జిల్లాలోని రణస్థలం, కోష్ట, పాలకొండ, కొల్లివలస,రాజాం, కోటబొమ్మాళి, గార, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో పౌల్ట్రీలు ఉన్నాయి. అందుబాటులో భారీగా కోళ్లు దొరుకుతున్నా ఇక్కడెందుకు మిగతా జిల్లాలతో పోలిస్తే చికెన్ ధరలు భారీగా ఉంటున్నాయని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. కోళ్లు అందుబాటులో ఉన్నా కావాలనే కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారన్న ఆరోపణలు ఇప్పటికే ఉన్నాయి.

ప్రస్తుత ధర ప్రకారం జిల్లాలో రోజుకు రూ.4కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఈ క్రమంలో ఒక్కో కిలోకు మిగతా జిల్లాలతో పోలిస్తే రూ. 50కు పైగా తేడా ఉండటంతో ఇక్కడ కొనుగోలు దారులు ఎంత అదనపు భారం మోస్తున్నారో లెక్క కట్టుకోవచ్చు. ఇదే విషయమై జిల్లా బాయిలర్ అసోసియేషన్ ప్రతినిధిగా కొనసాగుతున్న వెంకటేష్ అనే వ్యక్తిని 'సాక్షి' సంప్రదించగా 'మాకున్న ఇబ్బందులు మాకు ఉన్నాయి. మిగతా జిల్లాల పరిస్థితి వేరు. ఇక్కడ వేరు. అందుకనే ధర తేడా ఉంటుంది. పేపర్ రేటుకు, వాస్తవ ధరకు తేడా ఉంటుంది. బల్క్‌లో కొనుగోలు చేస్తే ఆ రేటు ఇంకా తగ్గుతుంది' అంటూ చెప్పుకొచ్చారు.

ధరలు పెంచుకుంటూ పోతున్నారు



చికెన్ ధరలను ఇష్టం వచ్చినట్లు పెంచుకుంటూ పోతున్నారు. కరోనాకు ముందు కిలో రూ.100కే దొరికేది. ఇప్పుడు మాత్రం రూ.275 ఉండటం దారుణం. ఆదివారం చికెన్ తిందామంటే ఒక్కోసారి రూ.300 మార్కు దాటిపోతోంది.

– ఆర్.యుగంధర్, కొనుగోలుదారుడు, గూనపాలెం, శ్రీకాకుళం.

దాబాలు నడపలేకపోతున్నాం



దాదాపుగా చికెన్ ఫుడ్ ఐటమ్స్ కోసం దాబాలకు అధికంగా వస్తుంటారు. కానీ చికెన్ ధరలు విశాఖ, విజయనగరం కంటే ఎక్కువగా ఉండడంతో నష్టాల బారిన పడుతున్నాం. కిలో రూ.275కు కొనుగోలు చేసి దాబాలు నడపాలంటే కష్టం. అలాగని రేటు పెంచితే కస్టమర్లు రారు. ఇటీవల కాలంలో దాదాపుగా శ్రీకాకుళం సిద్ధిపేటరోడ్డులో నాలుగు దాబాలు మూసేశారు. ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– పి.నవీన్, కేఫ్స్ స్పైసీదాబా, సిద్ధిపేట రోడ్డు, శ్రీకాకుళం.

వ్యాపారాలు చేయలేకపోతున్నాం



పక్క జిల్లాల్లో లేని ధరలు శ్రీకాకుళంలోనే ఉంటున్నాయి. కరోనా తర్వాత అమాంతంగా రూ.70కి పైగా పెంచేశారు. ధరలు తక్కువగా ఉన్నప్పుడు రోజుకి 400 కేజీలు అమ్మకాలు చేసేవాళ్లం. ధరలు పెరిగిపోవడంతో రోజుకి 200కేజీలు అమ్మడం కూడా కష్టమైపోతోంది. ఎందుకిలా ధరలు ఎక్కువగా ఉన్నాయని ప్రశ్నిస్తే వ్యాపారానికి కావాల్సిన చికెన్ ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నారు.

– వై.రాజు, చికెన్ వ్యాపారి, బలగ

నియంత్రణ మా చేతుల్లో లేదు



చికెన్, గుడ్లు ధరల నియంత్రణ మా చేతుల్లో లేదు. వ్యాధుల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు, వచ్చిన తర్వాత నివారణ చర్యలు మాత్రమే మేం చేపడతాం. ధరలు పెంచడం, నియంత్రించడంతో మాకు ఎలాంటి సంబంధం ఉండదు. విశాఖ, విజయనగరంల్లో ఏవిధంగా ధరలున్నాయో శ్రీకాకుళంలో కూడా అలాగే ఉండాలి. పౌల్ట్రీ వ్యాపారులు సిండికేటుగా మారి ధరలు ఇష్టం వచ్చినట్లు పెంచేస్తున్నారు. ధరల నియంత్రణకు జిల్లాలో సంబంధిత ప్రభుత్వ శాఖలతో కూడిన కమిటీ వేసి నియంత్రణకు చర్యలు చేపడితే బాగుంటుంది.

– డాక్టర్ పొట్నూరు సూర్యం, ఇన్‌చార్జ్ జేడీ, పశుసంవర్ధకశాఖ, శ్రీకాకుళం.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత ఓ ప్రకటనలో తెలిపారు. మోచేతి కింద కనీసం కొన్ని అంగుళాలు చేయి కలిగిన దివ్యాంగులకు రూ.34వేలు విలువ చేసే కృత్రిమ చేతులు అందిస్తారని పేర్కొన్నారు. డిసెంబర్ 10న గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎర్లెస్ మోడోస్ ప్రోస్టెటిక్ హ్యాండ్ ఫౌండేషన్ రోటరీ క్లబ్ సహకారంతో 'మంగళకరం' పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. కృత్రిమ అవయవాలు కావాల్సిన వారు హెల్ప్‌లైన్ నంబర్ 7207403150ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

శ్రావణ్.. నీ కీర్తి శాశ్వతం



- మరణిస్తూ మరో ఇద్దరికి ప్రాణదానం చేసిన విద్యార్థి

నరసన్నపేట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నరసన్నపేట మారుతీ నగర్‌కు చెందిన కృష్ణ శ్రావణ్ మరో ఇద్దరికి ప్రాణదానం చేశాడు. కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న శ్రావణ్ ద్విచక్ర వాహనంతో విజయవాడ దుర్గాదేవి దర్శనానికి వెళ్తూ మూడు రోజుల కిందట ప్రమాదానికి గురయ్యాడు. వైద్యం అందించిన విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు విద్యార్థి తల్లిదండ్రులు బంగారి రామరాజు, లావణ్య ప్రియతో సంప్రదింపులు చేసి అవయవ దానానికి అంగీకరింపజేశారు. గుండె, కాలేయం పనిచేయక పోవడంతో విద్యార్థికి చెందిన రెండు కిడ్నీలు శుక్రవారం జీవన్‌దాన్ రాష్ట్ర సమన్వయకర్త రాంబాబు ఆధ్వర్యంలో సేకరించి విశాఖలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులకు అందచేశారు. శ్రావణ్ పార్థివ దేహానికి స్వగ్రామం నందిగాం మండలం సుభద్రాపురంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. శ్రావణ్ తల్లి దండ్రులు బంగారి రామరాజు, లావణ్య ప్రియలకు పలువురు అభినందించారు.

ఆలిండియా తైక్వాండో పోటీలకు ఎంపిక



కుమార్‌కు అభినందన

టెక్కలి: టెక్కలి క్రీడా వికాస కేంద్రానికి చెందిన పూడి కుమార్ ఆలిండియా తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఎస్.శేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2 నుంచి 5 వరకు రాజస్థాన్ జె జెటీయూ యూనివర్సిటీలో జరగనున్న పోటీలకు జెఎన్‌టీయూ తరఫున కుమార్ పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సహోద్యోగులను వేధించిన సీహెచ్‌ఓపై బదిలీ వేటు

సారవకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్‌ఓ పద్మావతిని విజయవాడ బదిలీ చేశారు. తోటి ఉద్యోగులను వేధిస్తున్నారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆరు నెలల కిందట ఆస్పత్రిలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో, అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో సహా అందరికీ ఫిర్యాదు చేశారు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో డీఎంహెచ్‌ఓకు ఆస్పత్రి సిబ్బంది ఫిర్యాదు చేయగా అడిషనల్ డీఎంహెచ్‌ఓతో దర్యాప్తు చేయించి నివేదికను తెప్పించుకున్నారు. దీంతో ఆమెకు విజయవాడ బదిలీ చేస్తున్నట్లు రెండు రోజుల కిందట ఉత్తర్వులు వెలువరించారు.

నేడు స్విమ్మింగ్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-19 విభాగంలో పాల్గొనే స్విమ్మింగ్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఆదివారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణ తెలిపారు. స్విమ్మింగ్ పోటీలు శ్రీకాకుళం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 10 గంటలకు, ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు. వివరాల కోసం ఫోన్ నంబర్ 6302546128 సంప్రదించాలని సూచించారు.

● గ్రహణ కాలం



అరసవల్లిలో ఆదిత్యుని ఆలయం తలుపులు మూసివేస్తున్న దృశ్యం



శ్రీకూర్మనాథుని ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు, సిబ్బంది



శ్రీముఖలింగం ప్రధాన ఆలయానికి తాళం వేస్తున్న అర్చకులు

చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని ప్రధాన ఆలయాలు శనివారం రాత్రి మూసివేశారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ జరిపి మళ్లీ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల అర్చకులు తెలిపారు. – అరసవల్లి, జలుమూరు, శ్రీకూర్మం

● సంక్షేమ సమాచారం



బూర్జ మండలం ఉప్పపేట గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

స్పీకర్ తమ్మినేని సీతారాం బూర్జ మండలం ఉప్పపేటలో శనివారం కలియ తిరిగారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు అడిగి సంక్షేమ సమాచారాన్ని అందించారు. పలువురికి ఇళ్ల పట్టాలు కూడా అందజేశారు.

– బూర్జ

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- నవంబర్ 4వ తేదీన శ్రీకాకుళంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1 గ్రూప్–2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెలిసిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1, గ్రూప్ 2 పరీక్షలపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ:
నవంబర్ 4, 2023(శనివారం)

వేదిక:
సెమినార్ హాల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ (అటానమస్) ఫర్ ఉమెన్, శ్రీకాకుళం

సమయం:
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలు పంపించాల్సిన ఫోన్ నంబర్: 8977625795

పలాసలో నరకాసుర సినీ బృందం సందడి



పలాస రవిశంకర్ థియేటర్ వద్ద నరకాసుర టీమ్ సందడి

కాశీబుగ్గ: 'పలాస 1978' ఫేమ్ రక్షిత్ నటించిన మరో సినిమా నరకాసుర వచ్చే నెల 3వ తేదీన విడుదలవుతున్న సందర్భంగా శనివారం రాత్రి ప్రీరిలీజ్ ముందస్తు సమావేశం పలాసలో నిర్వహించారు. పలాసను సెంటిమెంట్‌గా భావించి తొలి కార్యక్రమం చేస్తున్నామని తెలిపారు. హీరో రక్షిత్ మాట్లాడుతూ తన కెరీర్ ఇక్కడే ప్రారంభమైందని, ఎన్ని సినిమాలు చేసినా పలాస వచ్చి కొబ్బరికాయ కొట్టి వెళ్తానని అన్నారు. అనంతరం హీరోయిన్లు సంగీత, అపర్ణలతో స్టేజీపై డ్యాన్స్ చేశారు. డైరెక్టర్ సెబాస్టియన్, పలాస నటులు గార రాజారావు, రవిశంకర్ యజమాని తంగుడు వీర్రాజు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

నాల్గో సారి.. పెంపు లేకుండా

- పదో తరగతి పరీక్ష ఫీజుల చెల్లింపునకు షెడ్యూల్ విడుదల
- నవంబర్ 10లోగా ఫైన్ లేకుండా చెల్లింపునకు అవకాశం
- యథాతథంగా ఫీజులు



పరీక్షలకు సమాయత్తమవుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపులకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్ నెలలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వరుసగా నాల్గో ఏడాది కూడా పరీక్ష ఫీజులలో ఎలాంటి పెంపు చేయలేదు. నవంబర్ 10వ తేదీ లోగా ఆలస్య రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించుకోవాలి. జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్నత పాఠశాలలు 581 ఉన్నాయి. యాజమాన్యాల వారీగా చూస్తే.. జిల్లాలో ఉన్నత పాఠశాలలు జెడ్పీహెచ్‌స్కూళ్లు 282, ప్రభుత్వ పాఠశాలలు 23, ఏపీ మోడల్ స్కూళ్లు 13, రెసిడెన్షియల్ స్కూళ్లు 2, సోషల్‌వెల్ఫేర్ 8, ట్రైబల్ వెల్ఫేర్ 2, వెనుకబడిన తరగతులు 10, గిరిజన ఆశ్రమపాఠశాలలు 25, కేజీబీవీలు 25, మున్సిపల్ స్కూళ్లు 15, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ 176 స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 30,117 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతు న్నారు. వీరంతా పరీక్ష ఫీజులు చెల్లించనున్నారు.

నవంబర్ 10లోగా ఫీజులు చెల్లించాలి..

వచ్చే నెల 10వ తేదీలోగా పదో తరగతి పరీక్ష ఫీజు ఆలస్య రుసుం లేకుండా చెల్లించవచ్చు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నవంబర్ 10వ తేదీలోగా నామినల్ రోల్స్ పూర్తి చేసిన తర్వాత స్కూల్ లాగిన్‌లోని లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సీఎఫ్‌ఎంఎస్ ద్వారా కాని, చలానా ద్వారా కాని పరీక్ష ఫీజు చెల్లిస్తే నిరుపయోగం అవుతుంది. రూ.50 ఆలస్య రుసుంతో నవంబ ర్ 11 నుంచి 16వ తేదీలోగా, రూ.200 ఆలస్య రుసుంతో నవంబర్ 17 నుంచి 22వ తేదీలోగా, రూ.500 ఆలస్య రుసుంతో నవంబర్ 23 నుంచి 30వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే వెసులుబాటు ఉంది. ఈ ఏడాది పరీక్ష ఫీజు చెల్లింపునకు ఎలాంటి గడువు పెంపు ఉండదని పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి స్పష్టం చేశారు. పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రస్తుత విద్యా సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి తమ పరీక్ష ఫీజు కేవలం రూ.125 చెల్లిస్తే సరిపోతుంది. ఫెయిలైన అభ్యర్థులు మూడు లేదా అంతకన్నా తక్కువ సబ్జెక్టులకైతే.. రూ.110, మూడు లేదా అంతకన్న ఎక్కువ సబ్జెక్టులకైతే.. రూ. 125 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు తమ పరీక్ష ఫీజు రూ.125కు అదనంగా ప్రాక్టికల్స్ కోసం మరో రూ. 60 చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ వయస్సుగల విద్యార్థులు(అండర్ ఏజ్ స్టూడెంట్స్) ఫీజుగా రూ. 300 చెల్లించాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పూర్తి చేసిన దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాల్సి ఉంది. చైల్డ్ విత్ స్పెషల్ నీడ్ (సీడబ్ల్యూఎస్‌ఎన్) విద్యార్థులు మాత్రం తమ పరీక్ష ఫీజు చెల్లించనవసరం లేదు. సదరం సర్టిఫికెట్ లేని దివ్యాంగ విద్యార్థులు సంబంధిత హెచ్‌ఎం ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం పంపించిన ఫార్మాట్‌లో సివిల్ సర్జన్ వైద్యుడు ధ్రువీకరించి సబ్మిట్ చేసే వీలును ప్రభుత్వం కల్పించింది.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు..

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపునకు షెడ్యూల్ విడుదలైంది. నిర్దేశిత గడువులోగా పరీక్ష ఫీజులు విద్యార్థులు చెల్లించేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. హెచ్‌ఎంలు మాన్యువల్ నామినల్ రోల్స్ తయారీలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం

నామినల్ రోల్స్ సరిచూసుకోవాలి

టెన్త్ పరీక్ష ఫీజులు ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా నవంబర్ 10 వరకు చెల్లించవచ్చు. టెన్త్ విద్యార్థుల నామినల్ రోల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. తప్పులకు అవకాశం లేకుండా ఎన్‌ఆర్‌లను ఒకటికి రెండు సార్లు సరిచూసుకుని సబ్మిట్ చేయాలి. చిన్న తప్పు దొర్లినా విద్యార్థి నష్టపోవాల్సి ఉంటుంది.

– లియాఖత్ ఆలీఖాన్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, డీఈఓ కార్యాలయం శ్రీకాకుళం

బంగారు లలిత

- నేషనల్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం కైవసం



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం పొందిన లలిత

నరసన్నపేట: గోవాలో జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్‌లో నరసన్నపేటకు చెందిన నేతింటి లలిత వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. 81 కేజీల విభాగంలో పాల్గొన్న లలిత ఏకంగా 211 కేజీలు బరువు ఎత్తి శభాష్ అనిపించింది. ఈ పోటీలు శనివారం జరిగాయి. జిల్లా నుంచి వెయిట్‌లిఫ్టింగ్‌లో నేషనల్స్‌లో గోల్డ్ సాధించిన మొదటి మహిళగా లలిత తన పేరును చరిత్రలో లిఖించుకుంది. నరసన్నపేట సత్యవరం కూడలిలోని శ్రీనివాస నగర్‌లో నివసిస్తున్న లలిత తల్లి మల్లేశ్వరి దినసరి కూలీ. తండ్రి సూర్యనారాయణ ఆర్టీసీ బస్ డ్రైవర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందారు. లలితను పెద్ద స్థాయిలో చూడాలని తండ్రి ఎంతగానో తపించేవారు. ఆ ధ్యేయంతోనే వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ ఇప్పించారు. స్థానిక వీర హనుమాన్ వ్యాయామ శాలలోనే లలిత తర్ఫీదు పొందింది. జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో పలు పతకాలు సాధించిన లలితకు క్రీడా కోటాలో ఉద్యోగం కూడా లభించింది. ప్రస్తుతం అస్సాం నార్త్ రైల్వే విభాగంలోని కామాఖ్య స్టేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నేషనల్స్‌లో బంగారం సాధించిన లలితను నరసన్నపేట ఎమ్మెల్యే, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, అలాగే జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కరరావు, కె.శ్రీనివాసరావు, నరసన్నపేట వీర హనుమాన్ వ్యాయామ శాల కోచ్ అప్పలరామయ్యలు, ఏలూరుకు చెందిన వెయిట్ లిఫ్టింగ్ కోచ్ రమేష్‌లు కూడా అభినందించారు.

నాలుగేళ్ల డిగ్రీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది (2023–24) ప్రారంభిస్తున్న నాలుగేళ్ల డిగ్రీ (ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాం) కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మవెంకటరావు తెలిపారు. పరిపాలన కార్యాలయంలో అధికారులతో కలిపి శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నాలుగేళ్ల డిగ్రీలో ఈడబ్ల్యూఎస్‌తో కలిపి డిగ్రీ+బీఏబీ ఈడీలో 55 సీట్లు, డిగ్రీ బీఎస్సీ+బీఈడీ 55 సీట్లు ఉన్నట్లు చెప్పారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఎడ్యుకేషన్ టెస్ట్‌లో బీఏబీఈడీకి 1106, బీఎస్సీ బీఈడీకి 1902 మంది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి ఆప్షన్లు ఇచ్చుకున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం వర్సిటీ ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రం యూనిట్‌గా ఈ కౌన్సెలింగ్ ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. విశ్వవిద్యాలయానికి విద్యార్థులు నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 13 వరకు గడువు వుందని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఈడీయు.ఐఎన్ వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. బీఏలో హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్, బీఎస్సీలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయని అన్నారు. నవంబర్ 13వ తేదీ లోపు దరఖాస్తుల స్వీకరణ, 16న మెరిట్ లిస్ట్ ప్రదర్శన, 17, 18 తేదీల్లో కౌన్సెలింగ్, 20న మిగులు సీట్ల ప్రదర్శన, 21న రెండో విడత ప్రవేశాలు, 23న క్లాస్‌వర్క్ ప్రారంభం, వసతి గృహంలో సీట్ల అలా ట్‌మెంట్ ఉంటుందని అన్నారు. ఓసీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.1000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ. 500 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఉద్దానంలో పెద్దపులి భయం



పెద్దపులి సంచరించిన పంట పొలాల్లో పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ నిషాకుమారి, మిగతా అధికారుల బృందం

కంచిలి: ఉద్దానంలోకి పెద్దపులి ప్రవేశించింది. కంచిలి మండలం మండపల్లి పంచాయతీ పరిధి అమ్మవారిపుట్టుగ గ్రామం పంటపొలాల్లో పెద్ద పులి పాదముద్రలను స్థానికులు శనివారం గుర్తించారు. మండపల్లికి చెందిన ఒక ఉపాధ్యాయుడు కాశీబుగ్గ అటవీరేంజర్ ఎ. మురళీకృష్ణం నాయుడుకు సమాచారం ఇవ్వడంతో, అటవీ అధికారుల బృందం హుటాహుటిన అమ్మవారిపుట్టుగ గ్రామానికి చేరుకున్నారు. సంబంధిత పొలంలో పాదముద్రలను గమనించి, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ద్రావణంతో పాదముద్రల పరిమాణాన్ని కచ్చితంగా కనుగొని, వాటి పొడవు 16 సెంటీమీటర్లు, వెడల్పు 14 సెంటీమీటర్లుగా గుర్తించారు. గ్రామంలో మాదిన మాదిన చౌదరినాయుడుకు చెందిన పొలంలో ఈ పెద్దపులి పాదముద్రలు లభించినప్పటికీ, ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటుచేసుకోలేదు. ఈ పులి ఒడిశా రాష్ట్ర పరిధి పర్లాఖిమిడి అటవీ ప్రాంతం నుంచి జిల్లాలోకి ప్రవేశించిందని, మూడు రోజులుగా పలాస మండలం లొత్తూరు నుంచి మందస మండలం పట్టులోగాం, కొండలోగాం చేరుకుందని, శుక్రవారం రాత్రికి కంచిలి మండలం అమ్మవారిపుట్టుగ గ్రామంవైపు సంచరించినట్టు తేలిందని కాశీబుగ్గ రేంజర్ ఎ.మురళీకృష్ణం నాయుడు తెలిపారు. ఎవరికైనా పులిసంచారంపై సమాచారం తెలిస్తే వెంటనే తన మొబైల్ నంబర్ (6302267775)కు తెలియజేయాలని కోరారు. పెద్దపులి పాదముద్రలు మండపల్లి పంచాయతీ అమ్మవారిపుట్టుగ గ్రామ పంటపొలాల్లో గుర్తించి, ధ్రువీకరించామని డీఎఫ్‌ఓ నిషాకుమారి తెలిపారు. దీనిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. చుట్టుపక్కల గ్రామాల వారు కూడా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.హైమావతి కోరారు. దీనిపై మండపల్లి పంచాయతీలో స్థానిక సర్పంచ్ మాదిన రజిని ఆధ్వర్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టాంటాం వేయించారు.

ఫేక్ యాప్‌తో టోకరా



తానెంలో ఆందోళన చేస్తున్న బాధితులు

పొందూరు: బిట్‌వెర్స్ యాప్‌లో పెట్టుబడులు పెడితే ప్రతి రోజు అధిక మొత్తంలో సొమ్ము ఇస్తామంటూ నమ్మబలకడంతో తామంతా నమ్మి పెట్టుబడి పెట్టి మోసపోయామంటూ విశాఖపట్నంకు చెందిన పలువురు బాధితులు వాపోయారు. బిట్‌వెర్స్ క్రిప్టో ఫేక్‌యాప్‌తో పొందూరు మండలం తానెంకు చెందిన బి.శ్రీనివాసరెడ్డితో పాటు, మరో ఇద్దరు తమ నుంచి డబ్బులు తీసుకుని మోసగించారని వారు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు విశాఖకు చెందిన పది మంది బాధితులు తానెం గ్రామానికి వచ్చి శ్రీనివాస రెడ్డి ఇంటి ముందు ఆందోళన చేశారు. తాము రూ.1.26 కోట్లు నష్టపోయామని, తమలాంటి వారు ఇంకెందరో ఉన్నారని తెలిపారు.

యాప్‌లో పెట్టుబడి పెట్టాలని చెబితే తాము తెలియక మోసగాడి ఖాతాకే డబ్బులు పంపించామని, అతను సంబంధిత నగదుకు సమానమైన డాలర్లను బిట్‌వెర్స్ యాప్‌లో బాధితుల ఐడీలకు చేర్చేవాడని, తిరిగి ఆ డాలర్లను అదే యాప్‌లో పెట్టుబడిగా పెట్టేవారమని తెలిపారు. రూ. 8 లక్షలకు పది వేల డాలర్లను యాప్‌లో బాధితుల ఐడీలకు పంపించేవారని చెప్పారు. ఆ పదివేల డాలర్లు తిరిగి అదే యాప్‌లో పెట్టుబడిగా పెట్టడంతో సంబంధిత యాప్ యజమానికే చేరేవని, ఇక్కడే మోసపోయామని చెప్పారు. అదే పది వేల డాలర్లను మిగిలిన వారికి పంపిస్తూ రూ.కోట్లలో మోసానికి పాల్పడ్డాడని చెప్పారు. వీరి ఆందోళనపై సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ రామచంద్రరావు గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. పొందూరు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని వారిని కోరారు. అయితే ఈ నెల 21న ఆమదాలవలసలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని చెప్పారు. పూర్తిస్థాయి ఆధారాలను సీఐకు సమర్పిస్తామన్నారు. విశాఖ, విజయనగరం, మన్యం జిల్లాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 500 మంది బాధితులు ఉన్నారని ధర్నా చేసిన వారు తెలిపారు.

హితమే అభి'మతమై'

- ఆదిత్యుని సన్నిధిలో ముస్లిం భక్తుల సందడి
- నిత్యాన్నదానానికి రూ.1.02 లక్షల విరాళం
- రాష్ట్రంలో ప్రధాన ఏడు ఆలయాలకు ఇలాగే విరాళాలిచ్చిన ముస్లిం కుటుంబం



అజ్మల్, మెహరూన్‌బీ దంపతులకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి శనివారం ఓ హృద్యమైన దృశ్యానికి వేదికైంది. తిరుపతి నుంచి వచ్చిన ఇద్దరు దంపతులు చక్కటి సంప్రదాయ దుస్తులు ధరించి స్వామిని దర్శించుకోవడం, అన్న ప్రసాదం స్వీకరించడం, ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడాన్ని ఆలయ సిబ్బందితో పాటు భక్తులు కూడా ఆసక్తిగా గమనించారు. వారి ఆసక్తికి కారణం ఆ దంపతులు ముస్లింలు కావడమే. ముస్లింలు హిందూ దేవాలయాలకు వెళ్లి పూజలు చేయడం చాలా అరుదు. అలాంటిది తిరుపతి నగరానికి చెందిన షేక్ అజ్మల్, మెహరూన్ బీ దంపతులు శనివారం ఆదిత్య క్షేత్రానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడి నిత్యాన్నదాన పథకానికి రూ.1,02,116 విరాళాన్ని సమర్పించారు. ఈ మేరకు నగదును ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. అంతకుముందు ఆదిత్యుని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదానానికి విరాళమిచ్చి ఇక్కడే కొంచెం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లాలో ప్రముఖమైన శ్రీకూర్మం, శ్రీముఖలింగం దేవాలయాలను కూడా దర్శించుకుని, శ్రీముఖలింగంలో అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులున్నారు.

ఏడు ఆలయాలకు నిత్యాన్నదాన విరాళాలు

తిరుపతిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైరయ్యాను. నా స్నేహితులతో కలిసి తిరుచానూరు, తిరుమల, కాణిపాకం, అన్నవరం, శ్రీకాళహస్తి, కుక్కుటేశ్వర సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయాలతో పాటు అరసవల్లి ఆలయాల్లో నిత్యాన్నదాన పథకానికి రూ. లక్ష చొప్పున విరాళాలను సమర్పించాం. ఇదో మొక్కుగా ఈ ఏడు ఆలయాలకు అందజేశాం. మాది ముస్లిం కుటుంబమే అయినప్పటికీ హిందూ దేవాలయాల్లో పూజలు చేయడాన్ని ఎంతో ఇష్టంగా భావిస్తున్నాం. ఎక్కడైనా ఏ మతమైనా అంతా ఒక్కటే అని చెప్తాయి. మనసు పవిత్రతతో మొక్కుకుంటే ఏ దేవుడైనా పలుకుతాడు. మన కోర్కెలు నెరవేర్చుతాడు. ఇదే సూత్రంతో మేము తరచుగా హిందూ ఆలయాలకు వెళ్తున్నాం.

– అజ్మల్, మెహరూన్‌బీ

క్లుప్తంగా

30న సప్తస్వర అవధానం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శంకరశర్మ, మండవల్లి రవి తదితరులు

అరసవల్లి: శ్రీసుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో ఈనెల 30న స్థానిక బాపూజీ కళామందిర్‌లో గిన్నిస్ రికార్డు గ్రహీత స్వరవీణాపాణి ఆధ్వర్యంలో సప్తస్వర అవధానం కార్యక్రమం జరుగుతుందని శ్రీసుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు. ఈ మేరకు అరసవల్లిలో ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కార్యక్రమానికి సంబధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన స్వర వీణాపాణి మీ మాట–నా పాట– పాట పుట్టుక అనే అవధాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని, ఈ మేరకు సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించనున్నామని, ప్రజలు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసుమిత్ర కళాసమతి సభ్యులు మండవిల్లి రవి, గుత్తు చిన్నారావు, ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

'అతిమంగా న్యాయమే గెలుస్తుంది'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: చంద్రబాబు ఎల్లకాలం వ్యవస్థలను మేనేజ్ చేయలేరని, అంతిమంగా న్యాయమే గెలుస్తుందని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆయన శనివారం ఆమదాలవలసలో గల జగనన్న ప్రజాసేవా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హైకోర్టులో చంద్రబాబు మధ్యంతర అత్యవసర బెయిల్ పిటిషన్ జస్టిస్ జ్యోతిర్మయి వద్ద నుంచి తప్పించాలని ఇప్పటివరకు కేసుతో ఎలాంటి సంబంధం లేని జీవీఎల్ మూర్తి అన్న ఒక న్యాయవాదితో చంద్రబాబు పిటీషన్‌కు వకాలత్ వేయించి, విలువలకు కట్టుబడిన జస్టిస్ జ్యోతిర్మయితో 'నాట్ బిఫోర్ మి' అని చెప్పించుకున్నారని వివరించారు. దీన్ని బట్టే చంద్రబాబు వ్యవస్థలను ఎంతలా మేనేజ్ చేయాలని చూస్తారో అర్థమవుతుందన్నారు. కానీ చంద్రబాబు పప్పులు ఇక ఉడకవని అన్నారు. పార్టీ కార్యకర్తలు కెప్టెన్ పైడి రామారావు, అన్నెపు కృష్ణ, రామ్మోహన్, రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన



పలాస కిడ్నీరీసెర్చ్ సెంటర్ బీటీ రోడ్డు పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్ నాయక్

కాశీబుగ్గ: పలాసలో నూతనంగా నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌ను పలాస రెవెన్యూ డివిజన్ అధికారి భరత్ నాయక్ శనివారం పరిశీలించారు. ఏ–బ్లాక్, బి–బ్లాక్‌తో పాటు ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎంఆర్‌స్కాన్, సిటి స్కాన్ వంటి వివిధ విభాగాలను పరిశీలించారు. మున్సిపాలిటీ వారు నిర్మిస్తున్న బీటీ రోడ్డు ఆలస్యం కావడంతో సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ఆయనతో పాటుగా పలాస తహసీల్దార్ లంబాల మధుసూదనరావు, ఆర్ నిరంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి స్పోర్ట్స్‌మీట్



పరుగు సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏటా జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్వర్గీయ కొన్న చిన్నారావు మెమోరియల్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్, తైక్వాండో చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆదివారం జరగనున్నాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానం వేదికగా నేడు జరగనున్న ఈ అథ్లెటిక్స్ మీట్‌కు దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం నాలుగు వయో విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ ఏడాది అథ్లెటిక్స్‌తోపాటు తైక్వాండో క్రీడలోను పోటీలను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం కల్పించారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాల్సి ఉంటుంది. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు) నేతృత్వంలో గత 16 ఏళ్ల నుంచి ప్రతి ఏటా (కోవిడ్ సమయంలో మినహా) క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మొదలు కానున్న ఈ పోటీలకు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పోటీలకు హాజరుకానున్నారు. క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.